
# కాలం జారిపోతుంది

వి.కృష్ణ ఆర్. కట్నేని



**నాకు బాగా గుర్తు. చిన్నతనంలో నన్ను ఎవరైనా 'ప్రయోజకుడు' అంటే ఎవర్రా?' అని అడిగితే "బాగా డబ్బు సంపాదించే వాడు" అని ఠక్కున జవాబు చెప్పేవాణ్ణి.**

అవును ఇప్పటికీ అదే అభిప్రాయం నాది. అలా ప్రయోజకుడిని కావడానికి నేను చాలా కష్ట పడాల్సి వచ్చింది. ఎందరినో దూరంగా ఉంచవలసి వచ్చింది. ఎన్నింటినో వదులుకోవలసి వచ్చింది. ఎన్నో అవరోధాలు ఎదుర్కోవలసి వచ్చింది. ఎన్నో మాటలు పడ వలసి వచ్చింది. అయితే అవన్నీ ఒకప్పుడు. ఇప్పుడు నేనో కోటీశ్వరుడిని. నాకున్న ఆస్తుల విలువ ఎంతో నేనే లెక్క కట్టలేనని లోకులు అనుకుంటూ ఉంటారు. అదేమీ అతిశయోక్తి కాదు. ఇప్పుడు ఎవరి మనసులో ఏమున్నా

నా దగ్గరున్న డబ్బు వలన అందరికీ గౌరవనీయుడిని మళ్లీమాట్లాడితే పూజనీయుడిని.

అప్పుడు -

అంటే? నేనా రేస్ ప్రారంభించే క్షణంలో దరిద్రుడిని. అలా అని పుట్టు దరిద్రుడినేమీ కాదు. నాతండ్రిని ఆయన దాయాదులు ఆయనకు చెంద వలసిన ఆస్తులు కాజేసి నడిరోడ్డున బికారిగా నిలబెట్టారు. అయినా ఆయన అష్టకష్టాలు పడి. నేనో డిగ్రీ కాగితం సంపాదించుకునేలా చేశాడు. పిచ్చి నాన్న, ఆ కాగితం నాకు ఏ కలక్టరు పదవో తెచ్చి పెడుతుందనుకునేవాడు. అయితే ఆ డిగ్రీ నాకు ఏ సందర్భంలోనూ అక్కరకు రాకుండా పోయింది.

నీతి నియమాల చూరు పట్టుకు వేళ్లాడకపోతే ఓ దరిద్రుడు కోటీశ్వరుడు కావడానికి లక్ష మార్గాలున్నాయి. అయితే అదృష్టమూ కలిసి రావాలి. నాకా అదృష్టమూ కలిసి వచ్చింది.

అయితే ఒకే ఒక్క చిత్రమైన సంగతి. నేను నా బీద జీవితానికి సంబంధించి అన్ని గుర్తులూ చెరివేసుకున్నాను ఒక్క దక్షిణామూర్తి విషయంలో తప్ప.

దక్షిణామూర్తి....

అవును దక్షిణామూర్తి.....

వాడు నా బాల్య స్నేహితుడు. మా నాన్నను ఆయన దాయాదులు ఇంట్లోంచి బయటకుగెంటి వేసిన తరుణంలో ఆయనను ఆదుకున్న రామచంద్ర రావుగారి కొడుకు ఈ దక్షిణామూర్తి. వాడూ, నేనూ కలిసి చదువుకున్నాం. కలిసి పెరిగాం. పొట్ట చేత పట్టుకుని కలక్టరాఫీసులో యూడీసిగా చేస్తున్నాడిప్పుడు.

చెవినిల్లు కట్టుకుని చెప్తుంటాను వాడికి నా కంపెనీల్లో ఇష్టమొచ్చిన దానికి మేనేజరుగా ఉండమని. వినడు. ప్చ్! వాడో బతకడం చేతకాని వాడు.

పైగా నేను నా జీవితాన్ని సార్థకం చేసుకోవడం లేదంటాడు. నాకు తృప్తి లేదంటాడు. తృప్తి పడడంలోనే ఏదో గొప్ప ఆనందం ఉందంటాడు. అదో రకం పిచ్చి వాడికి. ఆనాడు ఆదిమానవుడు దొరికిందేదో తిని, త్రాగి తృప్తి పడిపోయుంటే ఇంత నాగరకత ఈనాటికి సాధించగలిగేవాళ్లమా?

నాకు మానవ సంబంధాల విలువ తెలియదంటాడు. డబ్బిబ్బే నిషాలో మునిగిపోయి దానినే వ్యసనంగా చేసుకున్నానంటాడు. డబ్బు పిచ్చితో అయిన వాళ్లను దూరం చేసుకుని ఇహాన్నీ, పాపం, పుణ్యం, అన్న భావం లేకుండా ఎలాగైనా డబ్బు సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకుని చేయరాని పనులు చేసన్నా పరాన్నీ పోగొట్టుకుంటున్నానంటాడు. సమాజాన్ని గుల్ల చేస్తున్నానంటాడు. అన్నీ వెర్రి మాటలు వాడివి. డబ్బు సంపాదించడం చేతగాని ప్రతీవాడూ అనే మాటలే ఇవి. నా దృష్టిలో డబ్బు సంపాదించడం ఒక కళ. ఆ డబ్బును లాభసాటిగా ఖర్చు పెట్టుకోవడం మరో కళ.


సుమతీ శతకరుడు చెప్పినట్టు డబ్బున్న వాడికి వేలాది మంది బంధువులు. వాళ్ల డబ్బు చూసి వస్తారు కాని మన ముఖం చూసి కాదు. నేను దరిద్రుడిగా ఉన్నప్పుడు వీళ్లలో ఎవడు నా ముఖం చూశాడు కనుక?! అట్లాంటప్పుడు ఇప్పుడు వాళ్లను 'ఛీ పొ'మ్మను ఏమంటారు?


పాపం, పుణ్యం మాటకొస్తే ఒక్కొక్కరిదీ ఒక్కొక్క అభిప్రాయం. పాపం చేస్తే ఇదీ పరిహారం, పుణ్యం చేస్తే ఇదీ ప్రతిఫలం అని చెపుతారు కానీ దానికి రుజువేమిటి? దేవుడనే వాడే ఉన్నాడో లేడో అని జనం తన్నుకు ఛస్తుంటే స్వర్గమనీ, నరకమనీ భ్రమ పడడం ట్రాష్ కాక మరేమిటి? అయినా రాజకీయ నాయకులకు అధికార పక్షం, ప్రతిపక్షం అనే భేద భావాలు లేకుండా విరాళాలిస్తున్నట్టే, ఆ దేవుడి హుండీలోనూ కొంత డబ్బు వేస్తూనే ఉన్నాను. బ్రాహ్మల్ని పిలిపించి పూజలు జరిపించి దక్షిణ లిస్తున్నాను. ఎన్నో ధర్మ కార్యాలకూ విరాళాలిస్తున్నాను. ఏ దేవాలయానికి వెళ్లినా వేద మంత్రాలతో పూర్ణ కుంభంతో స్వాగతం లభిస్తుంది నాకు. పీఠాధిపతుల ఆశీర్వచనాలూ అందుబాటులోనే ఉన్నాయి. ఇవన్నీ దక్షిణామూర్తికీ తెలుసు. అయితే వాడేమంటాడో తెలుసా! నేను పాపాలు చేస్తున్నాననే భావన, ఆ పాపాలను కొంత వరకైనా కడిగేసుకోవాలనే తపన - నాలో ఉండబట్టే ఇవన్నీ చేస్తున్నానంటాడు. నిజానికి, దేవుడనే వాడుండీ, స్వర్గం, నరకం అనేవీ ఉంటే ఇప్పటి ఈ ఖర్చు అప్పటికి అక్కర కొస్తుందనే భావనా నాకుందనుకోండి.

అసలీ డబ్బు అనే పదమే చాలా విలువైంది. దానిని ఓ పక్క నిలుపు కొంటూనే మరోపక్క అభివృద్ధి చేసుకోవాలి. ఈ డబ్బే లేకపోతే ఈనాడు నేను 'ఛీ పొ'మ్మన్నా నా చుట్టూ తిరుగుతున్న ఈ జనంలో మచ్చుకొకరూ కన్పించరు. డబ్బు చుట్టూ ఉన్న వారిని ఆకర్షిస్తూ ఉంటుంది.

"ఒరే అబ్బులూ" పిలుపు విన్పించింది. నా ఆలోచనా ప్రవంతికి అడ్డుకట్ట వేస్తూ, నన్ను 'ఒరే' అనీ నా పాత జీవితాన్ని గుర్తుకు తెస్తూ 'అబ్బులూ' అని పిలిచే ధైర్యం వాడు..... ఆ దక్షిణామూర్తి కొక్కడికే ఉంది. వాడు అలా పిలిచినప్పుడల్లా అలా పిలవొద్దని వాడికి చెప్పాలన్పిస్తుంది. కాని చెప్పలేను. అలా చెప్పగలిగే ఉంటే ఈ దక్షిణామూర్తి నా ఇంటి వీధి గేటు దాటి లోపలకు రాగలిగే వాడే కాదు. వాడిని ఎందుకు వదులుకోలేకపోతున్నానో వాడిని చూసిన ప్రతిసారీ నాకు నా పాత జీవితం గుర్తుకు వస్తున్నా ఎందుకు సహిస్తున్నానో నాకే తెలియదు. అది నాకున్న ఒకే ఒక్క బలహీనత.

"ఒరే అబ్బులూ" మళ్లీ పిలుస్తూ నా మంచం మీద కూర్చున్నాడు వాడు. "అబ్బులూ! హార్ట్ ఎటాక్ వచ్చిందటగా. ఎలా ఉందీ?"






మీద చేయి వేసి రాస్తూ అడిగాడు. బాగానే ఉందన్నట్టు తలూపాను. వాడలా ఆప్యాయంగా ఆత్మీయంగా నావంక చూసినప్పుడల్లా నేనేదో అయిపోతూ ఉంటాను. ఏదో పెన్నిధి దొరికినట్టుంటుంది. ఆ క్షణంలో అదంతా ఒకే ఒక్క క్షణం...

మనుషుల మధ్య ఉన్న సంబంధం- అది భార్యభర్తల సంబంధమే కానివ్వండి, తండ్రీ కొడుకుల అనుబంధమే కానివ్వండి అంతా వ్యాపార మయమేనని నా అభిప్రాయం. మమతలు అనురాగాలూ, దిబ్బా, దిరుగుండం అంటూ సాగే పిచ్చివాగుడు అసలు పట్టదు నాకు. అయినా ఈ దక్షిణామూర్తిని చూస్తే ఒక్క క్షణం ఇలా కదిలిపోతుంటాను.

పిచ్చాపాటీ కబుర్లు మొదలెట్టాడు దక్షిణామూర్తి వింటూ అలాగే పడుకున్నాను.

రిజా వచ్చింది "హౌ ఆర్ యూ డియర్" అంటూ. రిజా నా భార్య 'పారిజాతం' అన్న ఆమె పూర్తి పేరు నచ్చక 'రిజా' అని మోడర్న్‌గా పిలుస్తుంటాను.

"ఫైన్ డియర్" అన్నాను.

నర్స్ వచ్చి నాకు పాలు, దక్షిణామూర్తికి టీ టీపాయ్ మీద ఉంచింది.

"ఓకే డియర్! నాకు రిచ్ లాండ్స్‌లో లేడీస్ కౌన్సిల్ మీటింగ్ ఉంది. షమీర్, షమ్మి చెరోకారూ పట్టుకుపోయారు. మీకెలాగో ఈ వేళ రెస్టే కదా! మీ కారు తీసుకుపోతున్నాను. ఓకే" చెప్పింది రిజా గదిలో నుంచి బయటకు నడుస్తూ.

"ఓకే" అన్నాను రిజా వెళ్లిపోయింది.

నోరు తెరుచుకు చూస్తున్నాడు దక్షిణామూర్తి. మా ఇంట్లో పద్ధతులన్నీ తెలిసినా ఎప్పటికప్పుడు ఆశ్చర్యమే వాడికి. నేను పాలు తాగి కప్ కింద పెట్టగానే కప్ తీసుకుని నర్స్ కూడా వెళ్లిపోయింది.

అప్పుడు ఇహలోకంలోకి వచ్చినట్టున్నాడు దక్షిణామూర్తి టీపాయ్ మీది టీ కప్ అందుకుని రెండు గుక్కల్లో తాగేసి కప్ కింద పెడ్తూ అడిగాడు.

"ఒరే అబ్బులూ! నీకు హార్ట్ ఎటాక్ వచ్చిందని నీ కొడుకు సమీర్‌కూ, నీ కూతురు షర్మిళకూ తెలుసున్రా?"

"తెలుసు ఉదయం ఓసారి చూసి వెళ్లార్లే" అన్నాను. నాకు తెలుసు. దక్షిణామూర్తి ఇంట్లో అంతా వేరుగా ఉంటుంది. ఏ ఒక్కరికి చిన్నపాటి జ్వరం వచ్చినా మిగిలిన వాళ్లందరూ తల్లడిల్లిపోతారు. ఆ జ్వరం తగ్గేవరకూ ఆ ఒక్కరి కోసమే తామందరమూ బతుకుతున్నట్టు ప్రవర్తిస్తారు. ఒకసారి దక్షిణామూర్తి కాలు ఫ్రాక్చరై హాస్పిటల్‌లో ఉండగా వెళ్లినపుడు చూశాను వాడి భార్య బిడ్డలు మిన్ను విరిగి మీద పడ్డట్టే ఉన్నారు. చూడ్డానికి వచ్చిన పరిచయస్థులు నలుగురే అయినా, వాళ్లు చూపించిన ఆప్యాయతలో కల్తీ లేదు. నాకు ఒంట్లో కొద్ది నలతగా ఉందని తెలిస్తే వేలాది మంది వస్తారు నన్ను చూసి పోవడానికి. వాళ్లు చూపించే ఆ అదోరకమైన సానుభూతి అంతా ఒక నటన ఆ సానుభూతి వెనుక ఆర్థిక పరమైన లావాదేవీలుంటాయి. 'ప్చ్ ఇలా అయిందా' అని బాధ పడుతున్న ముఖం వెనుక 'ఇలాగే జరగాలి వీడికి' అన్న వికృత సంతోషం ఉంటుంది.

అందుకే నాకెలాంటి అనారోగ్యం సంభవించిన ఆ వార్త నా కుటంబం దాటి బయటివారికి తెలియనివ్వలేదు.

"ఇది రెండోసారి కదూ నీకు హార్ట్ ఎటాక్ రావడం?" అన్నాడు దక్షిణామూర్తి.

తలూపాను ఆలోచిస్తూ.

నాకు హార్ట్ ఎటాక్ రాగానే డాక్టర్ వచ్చి ఇంజక్షన్ ఇచ్చాక నేను మగతతో వాలిపోతున్నపుడు నిన్న నా భార్య బిడ్డల సంభాషణ గుర్తొచ్చింది.

వచ్చిన డాక్టర్ దగ్గర నా ఆరోగ్య పరిస్థితి తెలుసుకోకుండా ముందు గదిలో నా ఫామిలీ లాయర్‌తో చర్చలు జరుపుతున్నారు నా వాళ్లు. 'నా కున్న ఆస్తులేమిటి? అప్పులేమిటి? ఎవరెవరి పేరిట ఏవి ఎంత ఉన్నాయి? ఒక వేళ నేను చనిపోతే అవన్నీ స్వాధీనం చేసుకోవడానికి ఎంత కాలం పడుతుంది?' అని.

మామూలుగా అయితే వాళ్ల ప్రాక్టికాలిటికి ముచ్చట పడేవాడినేమో... కాని ఇప్పుడు దక్షిణామూర్తిని చూస్తుంటే ఏదో వెలితిగా అన్పిస్తోంది.

దక్షిణామూర్తి వంక చూశాను. బరువు, బాధ్యతలతో నలిగిపోయి ఉన్నాడు. ముడతల పడ్డ చర్మం. ముగ్గు బుట్టలా నెరిసిపోయిన తల. వాడు నా కంటే మూడేళ్లు చిన్న అంటే వాడికంటే మూడేళ్లు ఎక్కువ నా వయసు. నా జుత్తుకు రంగు వేసుకుంటాను. ఇంకా బలంతోను, డబ్బు ఇచ్చిన సంతోషం తోను ఉన్నాను కనుక నా చర్మం ముడతలు పడలేదు. కాని నా మనసు ఇది వరకటి అంత దృఢంగా ఉండడం లేదు. దక్షిణా మూర్తి ముఖంలో తాండవిస్తున్న ఆ కళ నా ముఖంలో కన్పించదు. అదేమిటో మరి.

"... అబ్బులూ! ఇక నువ్వు నీ సంగతి చూసుకోవడం మంచిదిరా" అన్నాడు అకస్మాత్తుగా దక్షిణామూర్తి. వాడిలా అకస్మాత్తుగా ఏదో అనడం, నేను వినడం మామూలే.

"ఒరే అబ్బులూ! నిజం చెప్తున్నానురా! నువ్వింత సంపాదించావు. ఇంత వృద్ధిలోకి వచ్చావు. కానీ నీ కంటూ ఒక్క మనిషినైనా ఏర్పరచుకోలేక పోయావురా. నువ్వు... నువ్వు ఛస్తే ఒక గొడవ వదిలిపోతుందనుకుంటున్నార్రా నీ పిల్లలు. ఇలా తిరుగుతుండగానే నువ్వు పోతే తనకెంతో రిలీఫ్‌గా ఉంటుందంటోంది నీ ధర్మపత్ని నా చెవులతో విన్నాన్రా నీ భార్యా, నీ పిల్లలూ ఇలా అనుకోవడం'

' బొంగురు పోయింది వాడి గొంతు. కళ్ల వెంట ధారాపాతంగా నీళ్లు కారుతున్నాయి.

నాకు తెలిసిన విషయమే వాడూ చెప్తున్నాడు చిత్రం. ఎప్పుడూ లేనిది ఇప్పుడు నా గుండె కలుక్కుమంటోంది. ఎవరో పిండినట్లుగా బాధ... మానవ సంబంధాలన్నీ వ్యాపార సంబంధాలే అని నమ్మి, నా కుటుంబ సభ్యులలోనూ అదే భావాన్ని పెంచిన నాలో బాధ.

వాడికి తెలియని ఇంకో సంగతి తెల్సునాకు. వాడు రిటైరైన క్షణం నుంచి వాడిని పువ్వుల్లో పెట్టి పూజిస్తారు వాడి కొడుకులు. అసలిప్పుడే "నాకు ఉద్యోగం వచ్చింది కదా! ఇంకా నువ్వెందుకు కష్టపడడం. వాలంటరీ రిటైర్మెంటు తీసుకో నాన్నా! ఇప్పుడైనా సుఖపడు" అని పెద్ద కొడుకు బలవంత పెడుతున్నట్టు వాడే చెప్పాడు రెండు మూడుసార్లు సగర్వంగా. కాని నా సంగతి అలా కాదే. ఈ వ్యాపార నిర్వహణ ఒక్కసారి నా చేతుల్లోంచి జారిపోయిందంటే నేనో పనికి రాని వస్తువునైపోతాను ఇంట్లో. అప్పుడు నా పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవడానికే భయం వేస్తోంది. మా ఇంట్లో అందరికీ బిజినెస్ మైండే! అందుకే మరి ఈ వయసులోనూ... ఇలా అవస్థ పడుతున్నాను ప్రతి చిన్న విషయాన్నీ స్వయంగా చూసుకుంటూ.

దక్షిణామూర్తి లేచి నిల్చున్నాడు.

"ఒరే అబ్బులూ! ఇప్పుడైనా నా మాట విను. డబ్బే ప్రపంచంలోని పరమార్థం కాదురా. మనుషుల మధ్య ఉండేది డబ్బు రీత్యా ఉంటే సంబంధం మాత్రమే కాదురా. అష్టైశ్వర్యాలు వదులుకు వెళ్లిన గౌతమ బుద్ధుడు ఈ ప్రపంచానికే మార్గ దర్శకుడయ్యాడు. ఏ స్వార్థమూ లేకుండా భారతీయులందరినీ అన్నదమ్ములుగా, అక్క చెల్లెళ్లుగా భావించి, అష్టకష్టాలు భరించి స్వతంత్రం సాధించిన మహాత్ముడు మనకు జాతిపిత అయ్యాడు. తన జాతి స్వేచ్ఛ కోసం ప్రాణాన్ని పణంగా పెట్టిన కెన్‌సారోవివా విశ్వవిఖ్యాతుడ య్యాడు ఏ కోటీశ్వరుడికుందిరా వీళ్లకున్న కీర్తి ఏ కుబేరుడు నిలుస్తాడురా చరిత్ర పుటల్లో వీళ్లు కాకుండా?

"అబ్బూలూ! ఇప్పటికైనా మేలుకో నువ్వు ఒక మనిషివని గుర్తించని వారి కోసం నువ్వెందుకు నీ రక్తమూ, ప్రజల రక్తమూ కలగలిపి కోట్లు కూడబెడ తావు. నువ్వెలానూ అనుభవించలేవు. నీ జిహ్వ, నీ దేహం ఆ తృప్తిని అనుభవించే రోజులను దాటిపో యాయి. చూడరా! నీ కుటుంబ సభ్యులు మాత్రమే నీ వాళ్లు కాదురా! ఈ దేశం నీది. ఈ ప్రజలు నీ వాళ్లు. నీ సహాయం కోసం చేతులు చాచి ఉన్న నీ మాతృభూమి కన్న నీ సోదరుల్ని ఆదుకో. నీ చివరి కాలంలో అయినా ఇన్నాళ్ల నీ శ్రమను సార్థకం చేసుకోరా. నీ జన్మ ధన్యమైంది అన్పించుకోరా. నీ పాపాలను ప్రక్షాళన చేసుకోరా"

ఎక్కడో, ఏదో పగిలింది నాలో, ఏవో కరిగి ప్రవహిస్తోంది నా తనువంతా.

తేరుకుని చూసేసరికి దక్షిణామూర్తి గడప దాటుతూ కన్పించాడు. "దక్షిణా!" ఎలుగెత్తి పిలిచాను. ఇదివరకెప్పుడూ దక్షిణామూర్తిని అలా పిలువలేదు నేను.

ఇదివరకంతా నేను... నేను కేవలం జగన్నాథాన్ని మాత్రమే కదా!

* * *

అదే రోజు సాయంత్రం జగన్నాథం చనిపోవడం వలన రచయితనైన నేనే మీ ముందుకు రావలసి వచ్చింది. మీకు రెండు ముక్కలు చెప్పవలసి వచ్చింది.

జగన్నాథం చావుపై ఎవరెలా వ్యాఖ్యానించినా దక్షిణామూర్తి అభిప్రాయం ప్రకారం జగన్నాథం అతని భార్యా బిడ్డల చేతనే హత్య చేయబడ్డాడు. ఆ ఉదయం జగన్నాథం మనసు మార్చుకుని తనను వెనక్కు తను అంత వరకు సంపాదించిన డబ్బుతో అందరికీ ఉపయోగడే నాలుగు మంచి పనులు చెయ్యాలనుకుని ఆ విషయాలు మాట్లాడాడనీ, ఆ మాటలు ముగించి అతని గదిలో నుంచి బయటకు వస్తుండగా, తలుపు పక్క నుంచి గబగబా వెళ్లిపోతున్న జగన్నాథం భార్య పారిజాతాన్ని తాను చూశాననీ, సంపాదించిన డబ్బంతా ఇక ఇలా మంగళం పాడించేస్తాడని భయడిన ఆమే పిల్లల సహాయంతో జగన్నాథాన్ని హత్య చేసి ఉంటుందని, లేకపోతే ఉదయం బాగా కోలుకుని పిడుగులా ఉన్న మనిషి సాయంత్రానికెలా చనిపోతాడని దక్షిణామూర్తి వాదన. జగన్నాథానిది సహజమరణమే అంటున్నారు అతని భార్య బిడ్డలు.

ఏమైతేనేం జగన్నాథం ఆయువు తీరిపోయింది. నలుగురికి మంచి చేద్దామని నిర్ణయం తీసుకునే సరికి కాలం ఆయన చేతి నుంచి జారిపోయింది.

○



## సంబరం

చేయబోయే ఆపరేషన్ కోసం అసలే హడావిడిగా ఉన్న డాక్టర్ ఆ రోజే కొత్తగా చేరిన నర్స్, కాంపౌండర్‌లతో అన్నాడు.

"మీరు థియేటర్‌కి పదండి. నేను మీ వెనుకే వచ్చేస్తాను"

"ఏ సినిమాకి డాక్టర్" ఇద్దరూ అడిగారు సంబరంగా?

**కె.వి.మధుసూదనరావు** (కాకినాడ)

